నమస్తే తెలంగాణ
రంగారెడ్డి
I హైదరాబాద్, శుక్రవారం 16 ఆగస్టు 2024 | RANGAREDDY

- స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్య పునరుద్ధరణకు ప్రభుత్వం ప్రాధాన్యత
- వేడుకల స్ఫూర్తిగా జిల్లా ప్రగతిలో అన్ని వర్గాల ప్రజలు మమేకం కావాలి
- ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి
- రంగారెడ్డి కలెక్టరేట్‌లో ఘనంగా 78వ స్వాతంత్ర్య దినోత్సవం
- పాల్గొన్న కలెక్టర్ శశాంక, ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి, ఎమ్మెల్యేలు మల్ రెడ్డి రంగారెడ్డి, వీర్లపల్లి శంకర్, జిల్లా అధికారులు
- చూపరులను అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

# హామీలను అమలు చేస్తాం

రంగారెడ్డి, ఆగస్టు 15 (నమస్తే తెలంగాణ) : సమాజంలోని అట్టడుగున, అణగారిన వర్గాల ప్రజల సర్వతోముఖాభివృద్ధికి, సంపూర్ణ సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తున్నదని, ఎన్ని అవరోధాలు ఉన్నప్పటికీ ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరిస్తున్నదని ముఖ్యమంత్రి సలహాదారు(ప్రజా వ్యవహారాలు) వేం నరేందర్ రెడ్డి అన్నారు. గురువారం రంగారెడ్డి కలెక్టరేట్ ప్రాంగణంలో 78వ స్వాతంత్ర్య దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం వేం నరేందర్‌రెడ్డి మాట్లాడారు. 2023 డిసెంబర్ 7న ప్రారంభమైన ప్రజాపాలనలో తొలుత స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం పునరుద్ధరణకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తున్నదన్నారు. గ్యారంటీల అమలు కోసం ప్రజల నుంచి జిల్లాలో 5లక్షల 9వేల 849 దరఖాస్తులను స్వీకరించామన్నారు. జిల్లా ప్రగతిలో అన్నివర్గాల ప్రజలు మమేకం కావాలని పిలుపునిచ్చారు.

## హామీలను ఒక్కొక్కటిగా..

ఇంటింటా సౌభాగ్యాన్ని నింపాలన్న మహా సంకల్పంతో అభయహస్తం హామీలను తూచ తప్పకుండా ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని నరేందర్‌రెడ్డి అన్నారు. మహాలక్ష్మి పథకంలో జిల్లాలో ఇప్పటి వరకు 14కోట్ల 59లక్షల మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించారని తెలిపారు. సుమారు రూ.355.74కోట్లను ప్రయాణ చార్జీల రూపంలో మహిళలు ఆదా చేసుకున్నారన్నారు. జిల్లాలో లక్షా 93వేల 519 కుటుంబాలు రూ.500లకే వంటగ్యాస్ సిలిండర్ పొంది లబ్ధి పొందాయన్నారు. సబ్సిడీ కింద లబ్ధిదారులకు 1,43,946 సిలిండర్లకుగాను రూ.4.30కోట్లను చెల్లించడం జరిగిందన్నారు. గృహజ్యోతి పథకంలో భాగంగా 200 యూనిట్లలోపు విద్యుత్తు వాడే గృహ వినియోగదారులకు జీరో బిల్లులను జారీ చేయడం జరిగిందని, జిల్లాలో ఇప్పటివరకు 3లక్షల 33వేల కుటుంబాలకు జీరో బిల్లులను జారీ చేసి సబ్సిడీ కింద లబ్ధిదారులకు రూ.12.62కోట్ల లబ్ధి కలిగిందన్నారు.

## అన్నదాతలకు అండగా..

జిల్లాలోని అన్నదాతలకు భరోసా కల్పించే దిశగా అనేక పథకాలను అమలు చేస్తున్నట్లు వేం నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. రుణమాఫీ ప్రక్రియలో భాగంగా జిల్లాలో మొదటి విడుతలో 49,471 మంది రైతులకు సంబంధించిన రూ.257.19కోట్ల రుణాలను మాఫీ చేయగా.. రెండో విడుతలో 22,915 మంది రైతులకు రూ.218.13కోట్ల రుణాలను ప్రభుత్వం మాఫీ చేసిందన్నారు. ఆగస్టు 15 నుంచి మూడో విడుత రుణమాఫీ ప్రక్రియ కొనసాగుతుందని చెప్పారు. రైతు భరోసా పథకంలో భాగంగా యాసంగి 2024 సీజన్‌కు 3,25,217 మంది రైతుల ఖాతాల్లో రూ.343.11కోట్లను ప్రభుత్వం జమ చేసిందన్నారు. రైతు బీమాతో గత ఏడాది డిసెంబర్ నుంచి ఇప్పటి వరకు 653 మంది కుటుంబాలకు రూ.32.65 కోట్లను అందించామన్నారు.

## ప్రజారోగ్యానికి పెద్దపీట..

ప్రజారోగ్యానికి పెద్దపీట వేయడంలో భాగంగా జిల్లాలోని 558 గ్రామపంచాయతీలు, 16 మున్సిపాలిటీల్లో ప్రత్యేక పారిశుధ్య ప్రణాళికను అమలు పరుస్తున్నట్లు వేం నరేందర్ రెడ్డి వివరించారు. వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం జరుగుతుందన్నారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా జిల్లాలో 2,326 కిలోమీటర్ల మేర రోడ్లు, 1,694 కిలోమీటర్ల మేర మురుగు కాల్వలు, 4,922 ప్రభుత్వ సంస్థలను శుభ్రపర్చినట్లు తెలిపారు. ఆరోగ్యశ్రీ పథకం కింద 10 లక్షల 3వేల 89 మందికి వైద్య సేవలను అందించామని పేర్కొన్నారు.



జాతీయ జెండాను ఆవిష్కరించి వందనం చేస్తున్న సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, కలెక్టర్ శశాంక, వివిధ శాఖల అధికారులు

## తలసరి ఆదాయంలో జిల్లా ప్రథమ స్థానం..

రాష్ట్ర తలసరి ఆదాయంలో రంగారెడ్డి జిల్లా ప్రథమ స్థానంలో ఉన్నదని వేం నరేందర్ రెడ్డి తెలిపారు. జిల్లాలో పరిశ్రమలను స్థాపించి ఇక్కడి యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాల కల్పనకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదన్నారు. ఈ ఏడాది జనవరి 1 నుంచి టీజీఐపాస్ ద్వారా 75 మైక్రో, 48 స్మాల్, 15 మీడియం, 5 లార్జ్ పరిశ్రమలను రూ.5,946 కోట్లతో స్థాపించేందుకు పరిపాలన అనుమతులను మంజూరు చేయడం జరిగిందన్నారు. దీనిద్వారా 9,936 మందికి ఉపాధి కల్పించడం జరుగుతున్నదన్నారు. ఫోర్త్ సిటీ ఏర్పాటులో భాగంగా మీర్‌ఖాన్‌పేట్, ముచ్చర్ల వేదికగా నెట్ జీరో సిటీని ప్రభుత్వం ఏర్పాటు చేయబోతున్నదని, రూ.100 కోట్ల వ్యయంతో నైపుణ్యాభివృద్ధికి సంబంధించిన స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. ప్రభుత్వం వివిధ పథకాల కింద మంజూరు చేసిన ఆర్థిక సాయాన్ని లబ్ధిదారులకు పంపిణీ చేశారు. వివిధ పాఠశాలలకు చెందిన చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. దేశభక్తిని చాటేలా కడ్తాల్ కేజీబీవీ స్కూల్, ఎల్బీనగర్ అక్షర ఇంటర్నేషనల్ స్కూల్, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ నాదర్‌గుల్, చిల్డ్రన్స్ హోమ్స్ తుర్కయాంజాల్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తుక్కుగూడ విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ఆహూతులను అలరించాయి. వేడుకల్లో ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి, ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, వీర్లపల్లి శంకర్, కలెక్టర్ శశాంక, అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, మహేశ్వరం డీసీపీ సునీతా రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, కలెక్టరేట్ ఏవో సునీల్, ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఉత్తమ సేవలకుగాను ప్రశంసా పత్రం అందుకుంటున్న తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి






రంగారెడ్డిలో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన




కలెక్టరేట్‌లో జెండావిష్కరణ చేసి వందనం చేస్తున్న అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, కలెక్టర్ ప్రతీక్‌జైన్, వివిధ శాఖల అధికారులు

# ప్రజా సంక్షేమమే ధ్యేయం

## అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

వికారాబాద్, ఆగస్టు 15 : ప్రజాసంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తున్నదని, ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుందని రాష్ట్ర శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. గురువారం 78వ స్వాతంత్ర్య దినోత్సవాలను పురస్కరించుకొని కలెక్టరేట్ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించి వందనం చేశారు. అనంతరం ప్రజలను ఉద్దేశించి స్పీకర్ మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాల మేరకు అభయ హస్తం హామీలను ఒక్కొక్కటిగా అధికారంలోకి వచ్చిన 48 గంటల నుంచే అమలు చేయడం ప్రారంభించిందన్నారు. ప్రజల సమస్యలు నేరుగా తెలుసుకునేలా ఇందిరమ్మ గ్రామసభలు నిర్వహించి దరఖాస్తులను స్వీకరించి పథకాలను అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో ఆడపడుచులు ట్రాన్స్‌జెండర్లకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని ప్రభుత్వం అమలు చేస్తున్నదన్నారు. మహిళలు పైసా ఖర్చు లేకుండా రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణం చేసే సౌలభ్యం కల్పించామన్నారు. ఇప్పటి వరకు వికారాబాద్ జిల్లాలో 1.54 కోట్ల మంది మహిళలు ఈ ఉచిత రవాణా సౌకర్యాన్ని వినియోగించుకున్నారన్నారు. దీని ద్వారా రు. 56 కోట్ల లబ్ధి చేకూరిందని స్పీకర్ తెలిపారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని మరింత పకడ్బందీగా అమలు చేయడంతో పాటు, పేదలకు కార్పొరేట్ వైద్యాన్ని అందించాలన్న లక్ష్యంతో రాజీవ్ ఆరోగ్యశ్రీ వైద్య పరిమితిని ఐదు లక్షల రూపాయల నుంచి 10 లక్షల రూపాయల వరకు పెంచి అమలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ పథకం ద్వారా వికారాబాద్ జిల్లాలో 2,836 మంది పేదలకు చికిత్సలు చేయడం జరిగిందన్నారు. నిరుపేదలందరి సొంతింటి కల నిజం చేయాలని భావించి ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్నదన్నారు. ఈ ఒక్క ఏడాదిలోనే 4 లక్షల 50 వేల గృహాలు నిర్మించ తలపెట్టినట్లు తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో 3500 గృహాలు నిర్మిస్తామన్నారు. మహాలక్ష్మి పథకం కింద రూ.500లకే వంట గ్యాస్ సిలిండర్ సరఫరాలో భాగంగా జిల్లాలో లక్షా20 మందికి లబ్ధి చేకూరుతుందని, ఇప్పటికే 66,682 మంది వినియోగదారులకు రూ.1. 73 కోట్ల సబ్సిడీ ఇచ్చినట్లు తెలిపారు. గృహ జ్యోతి కార్యక్రమంలో భాగంగా 1,25, 721 కుటుంబాలకు లబ్ధి చేకూరుతుందని, రూ.9.8 కోట్ల సబ్సిడీ అందినట్లు తెలిపారు. రూ.2 లక్షల పంట రుణమాఫీలో భాగంగా జిల్లాలోని 1,09269 మంది రైతన్నలకు రూ.905 కోట్ల రుణమాఫీ చేసి రైతులను రుణ విముక్తి కలిగించామన్నారు. రైతు బీమా పథకం నుంచి 5829 మంది మృతి చెందగా, వారి కుటుంబాలకు రూ.291.45 కోట్లు అందించామన్నారు. వ్యవసాయ రంగానికి వానకాలంలో 75,437 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం కాగా, ఇప్పటి వరకు 30,320 మెట్రిక్ టన్నుల ఎరువులు సరఫరా చేయగా, 15,663 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. రైతు వేదిక ద్వారా రైతు నేస్తం కార్యక్రమంతో వివిధ అంశాలపై రైతులకు శిక్షణ ఇస్తున్నట్లు గుర్తు చేశారు. ఈ సంవత్సరం 830 ఎకరాల్లో రూ.2.40 కోట్ల వ్యయంతో పండ్లు, కూరగాయలు, పూల తోటల ఉత్పత్తిని పెంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించడంతోపాటు వివిధ మరమ్మతు పనులు చేపట్టేందుకు రూ.8 కోట్లు మంజూరు చేస్తూ, 1062 పాఠశాలలను గుర్తించి ఇప్పటికీ 924 పాఠశాలల్లో పనులు ప్రారంభించినట్లు పేర్కొన్నారు. ఇందులో 202 పాఠశాలల్లో అన్ని రకాల పనులు పూర్తయ్యాయని వివరించారు.

జిల్లాలో ఆహార భద్రత, అంత్యోదయ, అన్నపూర్ణ పథకాల ద్వారా 5337 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని 588 చౌక ధర దుకాణాల ద్వారా పంపిణీ చేయడం జరిగిందన్నారు. గ్రామీణ పేదరిక నిర్మూలనలో భాగంగా మహిళా సంఘాలకు స్త్రీనిధి బ్యాంక్ ద్వారా 216 సంఘాలకు రూ. 5.56 కోట్ల రుణం ఇవ్వడం జరిగిందన్నారు. 1447 సంఘాలకు బ్యాంకు లింకేజీ ద్వారా 13,869 లక్షల రుణాలు ఇవ్వడం జరిగిందన్నారు. మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా 3527 మంది మహిళల నిమిత్తం రూ.23.41కోట్ల ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. వృద్ధాప్య, వితంతు, కల్లు గీత, బీడీ, చేనేత కార్మికులు, ఒంటరి మహిళలు, హెచ్ఐవీ, ఫైలేరియా వ్యాధిగ్రస్తులకు అందిస్తున్న రూ.26.36 కోట్ల పింఛన్‌తో 1.10 లక్షల మందికి లబ్ధి చేకూరుతుందన్నారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా లక్ష కుటుంబాలకు లక్షా 82 వేల మంది కూలీలకు పని దినాలు కల్పించి రూ.137 కోట్లు చెల్లింపులు చేసినట్లు తెలిపారు. పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని ట్రాన్స్ మిషన్ నష్టాలు తగ్గించి నెట్‌వర్క్ బలోపేతానికి రూ.9 కోట్ల 74 లక్షల వ్యయంతో 9 అదనపు సామర్థ్యం గల మాస్ ఫార్మర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలోని అతిపెద్ద సాగునీటి ప్రాజెక్టు అయిన కోటిపల్లి ప్రాజెక్టును స్థిరీకరించి 9,200 ఎకరాలకు సాగునీరు అందించేందుకు ప్రతిపాదనలు రూపొందించినట్లు తెలిపారు. ఉద్దండపూర్ ఎడమ ప్రధాన కాలువ 10వ కిలోమీటర్ నుంచి 122.3 కిలోమీటర్ వరకు రూ.1470 కోట్లు మంజూరు చేశామన్నారు. కార్యక్రమంలో పరిగి , తాండూరు శాసన సభ్యులు రామ్మోహన్ రెడ్డి, మనోహర్ రెడ్డి, కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్‌లు లింగ్యా నాయక్, సుధీర్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమా హారతి, బీసీ కమిషన్ సభ్యులు శుభప్రద్ పటేల్, మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.





గోల్కొండలో జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో బొంరాస్‌పేట మండలం నాందార్‌పూర్‌కు చెందిన ఒగ్గు డోలు కళాకారులు



వికారాబాద్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న విద్యార్థులు



# అవినీతిని ఉపేక్షించేది లేదు

రంగారెడ్డి, ఆగస్టు 15(నమస్తే తెలంగాణ) : ఏ ప్రభుత్వ శాఖలోనూ అవినీతిని ఉపేక్షించేది లేదని రంగారెడ్డి కలెక్టర్ శశాంక స్పష్టం చేశారు. విధి నిర్వహణలో ఎవరైనా నిర్లక్ష్యం వహించినా.. అవినీతికి పాల్పడినా సహించేది లేదని, అలాంటి స్థితిలో ఎవరైనా ఉంటే తమ తీరును మార్చుకోవాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా పనులు చేయాలని ఒత్తిడి తెస్తే.. తలొగ్గేది లేదన్నారు. తనపై ఉన్న నమ్మకంతోనే రంగారెడ్డి జిల్లా బాధ్యతలను ప్రభుత్వం అప్పగించిందన్నారు. రంగారెడ్డి కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో గురువారం కలెక్టర్ శశాంక పలు అంశాలపై విలేకరులతో ముచ్చటించారు. ఎవరైనా తప్పు చేస్తే ఏసీబీ వంటి సంస్థలకు పట్టుబడడంతో పాటు ఉద్యోగాన్ని కోల్పోవాల్సి వస్తుందన్నారు. నిబంధనల ప్రకారం నడుచుకోవాలని అధికారులతో నిర్వహించే ప్రతి సమీక్షలోనూ తరచుగా చెబుతుంటానని అన్నారు.

## పారదర్శకంగా భూ సమస్యల పరిష్కారం..

రెవెన్యూ భూ సమస్యల పరిష్కారం కోసం ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను పారదర్శకంగా పరిష్కరిస్తున్నట్లు కలెక్టర్ శశాంక తెలిపారు. ఏ కాగితం లేకుండానే గతంలో రెవెన్యూ దరఖాస్తులకు ఆమోదం తెలిపిన సందర్భాలు ఉన్నాయన్నారు. తాను బాధ్యతలు చేపట్టాక ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తుతోపాటు ఫిజికల్ రిపోర్టు తెప్పించుకుని క్షుణ్ణంగా పరిశీలన చేశాకనే ఆమోదం తెలుపుతున్నట్లు చెప్పారు. లోక్‌సభ ఎన్నికలు పూర్తయ్యేనాటికి జిల్లాలో 46వేల వరకు పెండింగ్ దరఖాస్తులు ఉండేవని, క్రమక్రమంగా పరిష్కరించి ప్రస్తుతానికి 27వేలకు తగ్గించినట్లు తెలిపారు. జూన్ నాటికి ఉన్న పెండింగ్ దరఖాస్తులన్నింటినీ ఎట్టిపరిస్థితుల్లోనూ నెల రోజుల వ్యవధిలో పరిష్కరిస్తామన్నారు. ఏ కారణం లేకుండా దరఖాస్తులను తిరస్కరిస్తున్నట్లు ప్రచారం జరుగుతున్నదని, ఇది వాస్తవం కాదన్నారు. సదరు వ్యక్తులు కోర్టుకు వెళ్తున్నందున తిరస్కరించిన ప్రతి దరఖాస్తుకు గల కారణాలను పోర్టల్‌లో తెలియచెబుతున్నామన్నారు. తాను వచ్చాక అన్యాక్రాంతమైన రూ.వందల కోట్ల విలువైన భూముల పరిరక్షణకు చర్యలు చేపట్టినట్లు వివరించారు.

> నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించాలని ఒత్తిడి తెస్తే..తలొగ్గేది లేదు
> పారదర్శకంగా రెవెన్యూ భూ సమస్యల పరిష్కారం
> నెల రోజుల్లో రెవెన్యూ దరఖాస్తులను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నాం
> రంగారెడ్డి కలెక్టర్ శశాంక

## నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటాం

ఇబ్రహీంపట్నం, అబ్దుల్లాపూర్‌మెట్ మండలాల పరిధిలోని అనాజ్‌పూర్, నాగన్‌పల్లి గ్రామాల్లోని అసైన్డ్ భూముల వ్యవహారంలో నెలకొన్న వివాదంపై కలెక్టర్ మాట్లాడారు. అసైన్డ్ భూములను రైతులు ఇవ్వడం.. వేరొకరు తీసుకోవడం కుదరదని, అమ్మడం, కొనడం వంటి ప్రక్రియ ఉండదని స్పష్టం చేశారు. ఇప్పటికే సంబంధిత రైతులకు నోటీసులు జారీ చేశామన్నారు. రైతుల నుంచి సమాధానం వచ్చాక ప్రభుత్వ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. వివాదాస్పద భూముల్లో ప్రస్తుతానికి పనులను నిలిపివేశామన్నారు. ప్రభుత్వ స్థలాలు ఉన్నచోట బోర్డులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు.